క్లుప్తంగా

ట్రాన్స్‌కో.. మేలుకో



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎగబాకిన తీగలు

పరవాడ: పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో దిబ్బల గొర్లివానిపాలెం రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లిక తీగలు చుట్టేశాయి. ఇక్కడ నుంచి దిబ్బల గొర్లివాని పాలెం, సబ్‌స్టేషన్ పరిసర ప్రాంత ప్రజలకు విద్యుత్ సరఫరా అవుతోంది. కాగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగలు అల్లుకోవడంతో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. చుట్టూ దట్టంగా అల్లుకున్న తీగలను తొలగించడానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్



విద్యార్థులతో డీఈవో చంద్రకళ

పెందుర్తి: జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్లు కావడంతో పెందుర్తిలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఐదో రోజు శుక్రవారం ఉత్సాహభరితంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. అనంతరం డిజిటల్, చార్ట్ ప్రిపేరింగ్, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి, హెచ్ఎం సి.హెచ్. చిన్మయిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికుల దీక్షలకు భెల్ సిటూ మద్దతు



దీక్షలో మాట్లాడుతున్న భెల్ సిటూ ప్రధాన కార్యదర్శి ప్రకాష్

అక్కిరెడ్డిపాలెం: పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోర్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు భెల్ (హెచ్‌పీవీపీ) సిటూ నాయకులు సంఘీభావం తెలిపారు. సీహార్స్ జంక్షన్‌లో చేపట్టిన దీక్షల్లో భెల్ సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ ఇప్పటికే ఐదు బెర్తులను ప్రైవేటువారికి అప్పజెప్పారని, మిగతా వాటిని కూడా ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భెల్ సిటూ పూర్తి స్థాయి మద్దతు తెలుపుతుందన్నారు. కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిటూ నాయకులు జి.అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

భీమునిపట్నం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అవి ఎక్కడా జరగకుండా చూడాలని శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ప్రమీల సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు చేపట్టిన మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎగువపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం ఆమె మాట్లాడారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాతే వివాహం చేయాలని, ముందుగా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే వారిపై వుందన్నారు. ఇటువంటివి తెలిస్తే ముందుగానే అధికారులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు.



గోతులమయంగా కె. కోటపాడు-పినగాడి రోడ్డు



పెట్రో,మారిటైం విశ్వవిద్యాలయాలకు వెళ్లే రాయపుర అగ్రహారం సమీపంలో అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డు

ప్రయాణం.. నరక ప్రాయం

- శిథిలమైన రోడ్లు
- ఇటీవల కురిసిన వర్షాలతో గోతులమయం

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఫలితంగా ఆయా గ్రామాల మీదుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

- **గొల్లలపాలెం సమీపంలో సబ్బవరం- జోడుగుళ్ల నుంచి అమృతపురం జాతీయ రహదారి వైపు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా ఉంది. సబ్బవరం నుంచి నరవ మీదుగా విశాఖపట్నం వెళ్లేందుకు దగ్గర మార్గం కావడంతో ఈ రోడ్డు నిత్యం** రద్దీగా ఉంటుంది.
- ఆరిపాక నుంచి రాయపుర అగ్రహారం వెళ్లే రోడ్డు ఛిద్రమైంది. పెట్రో యూనివర్సిటీ,మారిటైం యూనివర్సిటీ భవనాల నిర్మాణం వేగవంతం కావడంతో భారీ వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దారుణంగా మారింది.
- **అంతకాపల్లి,రావలమ్మపాలెం మీదుగా గుల్లేపల్లి వెళ్లే బీటీ రోడ్డు గోతులమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**
- **గుల్లేపల్లి నుంచి పినగాడి వెళ్లే రోడ్డు మల్లునాయుడుపాలెం వద్ద రోడ్డు అధ్వానంగా తయారయ్యింది.** కె. కోటపాడు నుంచి విశాఖ వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం రోడ్డు గోతులతో ఉండడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.
- అనకాపల్లి-సబ్బవరం జాతీయ రహదారి నుంచి బలిజపాలెం మీదుగా నారపాడు వైపు వెళ్లే రోడ్డు ధ్వంసమైంది.



గొల్లలపాలెం సమీపంలో నామ రూపాల్లేకుండా శిథిలమైన అమృతపురం రోడ్డు



బలిజపాలెం రోడ్డు ఇలా..



గుంతలమయమైన రావలమ్మపాలెం-గుల్లేపల్లి రోడ్డు

ఘనంగా కార్గిల్ దివస్

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల జీఎం కె.రమ్య మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారతదేశ సైనికులు సాధించిన విజయానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ యుద్ధంలో భారత సాయుధ బలగాలకు చెందిన 527 మంది వీర మరణం పొందారని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు సైనికుల వేషధారణలతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, ప్రిన్సిపాల్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.



సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు

కల్యాణం.. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడా వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం , కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకటపతిపాలెంలో సమస్యల తిష్ట



శిథిలావస్థకు చేరిన మంచినీటి పథకం



కూలడానికి సిద్ధంగా ఉన్న సామాజిక భవనం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడానికి 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన మినీ మంచినీటి పథకం శిథిలావస్థకు చేరింది. పిల్లర్లు పెచ్చులూడిపోతున్నాయి. ట్యాంకు శ్లాబు పెచ్చులుగా ఊడిపోవడంతో నీరు లీకవుతోంది. తరచూ మోటారు మరమ్మతులకు గురవడంతో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలడానికి సిద్ధంగా సామాజిక భవనం

అలాగే గ్రామంలో 30 ఏళ్ల కిందట నిర్మించిన సామాజిక భవనం శిథిలమై నేడోరేపో కూలడానికి సిద్ధంగా ఉంది. పిల్లర్లు దెబ్బతిని గచ్చులు పాడైపోయాయి. ఏ మాత్రం వర్షం వచ్చినా శ్లాబు కారిపోతోంది. పాడైన సామాజిక భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- వీధి లైట్లు కూడా పూర్తిస్థాయిలో వెలగడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఫిర్యాదుదారులతో స్నేహభావంతో మెలగాలి

- సీపీ శంఖబ్రత బాగ్చి
- న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సందర్శన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి సూచించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల అన్ని ప్రాంతాలు పరిశీలించారు. స్టేషన్‌తో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది విధ్యుక్తతలు తెలుసుకుని, వారి పనితీరుపై ఆరా తీశారు. వారికి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రైం ప్రివెన్షన్, డిటెక్షన్, ప్రాసిక్యూషన్‌కు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి రవాణా చేసిన, నిల్వ చేసిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

శాకంబరిగా కనకదుర్గ



పూజలందుకున్న అమ్మవారు

పెందుర్తి: ఎస్ఆర్ పురంలో కొలువుదీరిన కనక దుర్గమ్మకు ఆషాఢ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో 31.2 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఆకాష్, పాడువకు చెందిన భీముండు, హర్యానాకు చెందిన అవినాష్, బిహార్‌కు చెందిన అమృత్‌కుమార్, కేరళకు చెందిన టామ్ అలెక్స్‌లు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళ, కర్ణాటక, హర్యానా, బిహార్ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.1,04,500 విలువైన 31.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామా టాకీస్ రోడ్డులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సుమారు 15.61 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌కు చెందిన సఫాల్ సలీం, సునీల్‌కుమార్, అబిన్ సుబ్రాన్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి



మహాసభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న పిలుపునిచ్చారు. ఉక్కునగరంలో శుక్రవారం నిర్వహించిన కేవీపీఎస్ 7వ మహాసభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని దేశ ప్రజలందరూ అంబేడ్కర్ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ అధికారం కొంత మంది చేతుల్లో ఉందని, బడుగు, బలహీన వర్గాల చేతిలో ఉన్నప్పుడే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అన్నారు. ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులందరూ ఏకమైతే నిజమైన రాజ్యాంగ ఫలం దక్కుతుందన్నారు. కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతో పాటు హక్కులు కాపాడుకోవడానికి అందరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎం.కృష్ణారావు, వి.ప్రకాశ వరకుమార్, టి.చిరంజీవి, వై.టి.దాస్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కార్మికనగర్‌లో ఆక్రమిత స్థలంలో తొలగించిన గోడ

పెందుర్తి: సుజాతనగర్ సమీపంలోని కార్మికనగర్‌లో ప్రభుత్వ చెరువులో ఆక్రమణను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. చెరువులో స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. కార్మికనగర్‌తో పాటు పెందుర్తి రెవెన్యూ పరిధిలో బ్రోకర్లుగా అవతారం ఎత్తి ప్రభుత్వ స్థలాలు అమ్ముకుంటున్న వ్యవహారంపై సాక్షి దినపత్రికలో శుక్రవారం 'బ్రోకర్ల ఇష్టారాజ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ ఆక్రమణలు తొలగించారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు



ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, అధికారులు

పెందుర్తి: గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధి కారకాలైన దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. ఫ్రై డే-డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుర్రంపాలెం పంచాయతీలోని ప్రజలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పరిసరాల్లో దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కుండీలు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లు, ఏసీలు, పూల కుండీలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండి దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉందన్నారు. అందుకే ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని.. ఈ విషయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రజలకు తగిన సూచనలు సలహాలు అందించాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సర్పంచ్ ఉగ్గిన గోవింద ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.నీలవేణి, ఏరియా కో ఆర్డినేటర్ కె.సత్యంనాయుడు, జిల్లా యాంకర్ ఎం.రేణుక, మండల ఏపీఎం బి.వి రమణ, సీసీ పి.ఈశ్వరి, పంచాయతీ కార్యదర్శి పి.నాగప్రభు, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

- వేపగుంట ముత్యమాంబ కాలనీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో డ్రై డే పాటించారు. పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించారు. ప్లకార్డులతో అవగాహన కల్పించారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమస్యలపై ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా చైర్మన్ ప్రాన్ మాట్లాడుతూ అనేక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకూ పరిష్కారం చేయలేదని దుయ్యబట్టారు. కూర్మన్నపాలెం డిపోకు చెందిన కండక్టర్‌పై దౌర్జన్యం చేయడం సహించ రానిదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా కేసులు పెట్టడం మానుకోవాలని నినదించారు. డిపో అధ్యక్షుడు బి.ఎ.నాయుడు, కార్యదర్శి జేఎస్ఈఎస్ రాజు, అచ్చిబాబు, ఉపాధ్యక్షుడు ఆర్‌డీ నాయుడు, ప్రచార కార్యదర్శి సీహెచ్ఎస్. వాసు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో 'ఉక్కు'ను కాపాడుకుందాం



మాట్లాడుతున్న మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణకు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లడం మంచిదని మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1261వ రోజు, శుక్రవారం ఉక్కు ఇంటక్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే శరణ్యమని, అలాగే తక్షణ సాయంగా విశాఖ ఉక్కుకు రూ.పదివేల కోట్లు అందివ్వాలని డిమాండ్ చేశారు. మూడున్నర ఏళ్ల నుంచి ఉద్యమం కొనసాగుతున్నా లెక్క చేయకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. తెలుగు ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌తో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఉక్కు ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలనే ఆలోచన రావడం దుర్మార్గమని, దానికి అనుగుణంగా అడుగులు వేయడం దేశ ద్రోహం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జి.వి.సుబ్బయ్య, కారు రమణ, కొవిరి అవతారం, పి.వి.రమణమూర్తి, పోతారెడ్డి, హరనాథ్, గంగవరం గోపీ, త్రిమూర్తులు, వేణు వర్మ, ఎస్.ఎ.నాయుడు,గోవిందరావు, గోపాలరాజు, ఆర్.జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



ర్యాలీ చేస్తున్న సీపీఎం శ్రేణులు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించారని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి విమర్శించారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై శుక్రవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని,స్టీల్ ప్లాంట్ నిర్వహణకు సొంత గనులు కేటాయించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం. గౌరీశ్వరరావు,డి. రమణమ్మ,కె. బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.